
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శుక్రవారం 26 జూలై 2024





సీలేరులో వర్షం

కరెంట్ కష్టాలు

రోజులో గంట కూడా సరఫరా ఉండడం లేదు

- అరకులోయ వాసులు ఆగ్రహం
- గత మూడు రోజులుగా ఇదే దుస్థితి
- ఈదురుగాలులే కారణమంటున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

అరకులోయ, జూలై 25:

అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు అరకులోయలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత మూడు రోజులుగా పట్టణంలో ఎప్పుడు కరెంట్ ఉంటుందో..ఎప్పుడు పోతుందో తెలియడం లేదంటూ విదుత్ వినియోగ దారులు మండిపడుతున్నారు. విద్యుత్ సరఫరా స్థిరంగా గంట పాటు ఉండడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ పట్టణంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేదు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య కరెంట్ వచ్చినట్టే వచ్చి పోతోందని వారంటున్నారు. గతంలో రోజుల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదన్నారు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో మాత్రమే కొంత ఇబ్బంది పడినా అనంతరం విద్యుత్ సరఫరా బాగానే ఉండేదని వినియోగదారులు అంటున్నారు. కానీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యుత్ సరఫరా ఉండడం లేదని పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహాల్లో ఉండే వందలాది మంది విద్యార్థులు, గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పట్టణంతో పాటు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో సరఫరాకు అంతరాయం ... మిగతా 8వ పేజీలో

నేడు మీ కోసం

పాడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల వేదిక మీ కోసం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన నేపథ్యంలో గత శుక్రవారం మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేశారు. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ శుక్రవారం మీకోసం కార్యక్రమంపై సందిగ్ధం నెలకొంది. అయితే ఐటీడీఏ పీవో వి.అభిషేక్ చింతూరు నుంచి పాడేరు వచ్చేయడంతో ఆయన ఆధ్వర్యంలో మీకోసం నిర్వహించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు.

నష్టం అపారం

వారం రోజులుగా ముంచెత్తుతున్న వర్షం



ముంచంగిపుట్టు మండలం జర్జుల ప్రాంతంలో నీట మునిగిన వరి పంట

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

వారం రోజులు జిల్లాను వర్షాలు కుదిపేశాయి. ఊహించని విధంగా ఈనెల 19వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. వరదల ప్రభావంతో 122 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలో 43,727 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

- జిల్లా వ్యాప్తంగా వరదల ప్రభావం
- వరద బాధితులు 43,727 మంది
- ప్రభావిత గ్రామాలు 122..
- వరద నష్టం రూ.62.07 లక్షలు
- ముంపు ప్రాంతాల్లో చురుగ్గా సహాయక చర్యలు

జిల్లాలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కూనవరం, చింతూరు, వీఆర్.పురం, ఏటపాక మండలాల్లో వరదల ప్రభావం తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల్లోని వందలాది గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. జిల్లా వ్యాప్తంగా 1,034 ఇళ్లు దెబ్బతిన్నాయి. అలాగే పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు చెందిన సుమారు 87.5 కిలోమీటర్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. ఉద్యాన పంటలకు పెద్దగా నష్టం వాటిల్లనప్పటికీ 30 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరి నాట్లు దశలో ... మిగతా 8వ పేజీలో



బాధితులకు ఇచ్చిన సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఈనెల 25వ తేదీ నాటికి వరద నష్టంపై అంచనా నివేదిక

ఇళ్లకు జరిగిన నష్టం	రూ.17,07,000
పశువులు	రూ.1,00,000
ఆర్‌అండ్‌బీ రోడ్లు	రూ.43,00,00
పంచాయతీరాజ్ రోడ్లు	రూ.1,00,000
మొత్తం	రూ.62,07,000

నేడు ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే సెలవు

పాడేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే శుక్రవారం సెలవు ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు యథావిధిగా తెరచుకుంటాయని పేర్కొన్నారు. అలాగే వరద బాధిత పునరావాస కేంద్రాలున్న ప్రాంతాల్లోని అన్ని విద్యాలయాలకు సెలవులు కొనసాగుతాయన్నారు. ఈ మార్పును విద్యాశాఖాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

తగ్గని ముసురు!

ఈదురుగాలులతో వర్షం

- అక్కడక్కడ కూలుతున్న చెట్లు
- చింతూరు ప్రాంతంలో ముంపు బెడద
- పాడేరు డివిజన్‌లో గెడ్డల ఉధృతి
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, అధికారులు

పాడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

అల్పపీడనం, వాయుగుండం ప్రభావం తగ్గినప్పటికీ గురువారం జిల్లాలో ముసురు మాత్రం కొనసాగుతున్నది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. దీంతో జనం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గాలులు వీస్తుండడంతో విద్యుత్ తీగలు తెగి పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. అలాగే అక్కడక్కడ చెట్లు నేలకూలుతున్నాయి. దీంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. జిల్లాలో వర్షాలు కొనసాగుతుండడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా గెడ్డలకు అవతల ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అలాగే చింతూరు డివిజన్ పరిధిలో ... మిగతా 8వ పేజీలో

మల్లెతోట, జలుమూరు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

బాధితుల సహాయక, పునరావాస చర్యలపై ఆరా

- ఇబ్బందులు తలెత్తకుండా సాయం అందించాలని సూచన

పాడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏజీ.కోడేరు పంచాయతీ మల్లెతోట, జలుమూరు బాధిత గ్రామాల్లో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం పర్యటించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలు నీటి మునిగి ఉండడంతో బోటులో ప్రయాణించి వరద బాధితుల వద్దకు చేరుకున్నారు. బాధితులకు అందుతున్న సహాయం, తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు అందించిన సరకులు, ఇతర సామగ్రిని పరిశీలించారు. అధికారులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అక్కడ నుంచి వీఆర్.పురం మండలం రామవరం, చొప్పళ్ల మార్గంలో రోడ్డుపై వరద నీరు ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. తమ గ్రామాలను పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా గుర్తించాలని మల్లెతోట, జలుమూరు వాసులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతానన్నారు. వరదల నేపథ్యంలో ముంపు ప్రాంత ప్రజలు ఎటువంటి సహాయానికైన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అక్కడ అంగన్‌వాడీ కేంద్రంలోని పాలు, గుడ్లు, వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్ మీనా, తహసీల్దార్ నజీముల్లా, సీడీపీవో గౌరి, ఎంపీడీవో రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఉరకలేస్తున్న చాపరాయి గెడ్డ

ఉధృతంగా చాపరాయి

- సందర్శనను నిలిపేసిన నిర్వాహకులు
- నిరాశతో వెనక్కి వెళుతున్న పర్యాటకులు

డుంబ్రిగుడ, జూలై 25: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు చాపరాయి జలవిహారి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చాపరాయి జలవిహారిలో పర్యాటకుల సందర్శనను నిర్వాహకులు నిలిపివేశారు. పర్యాటకులు ముఖ ద్వారం వెంబడి తిరిగి వెనక్కి వెళ్లిపోతున్నారు. చాపరాయి ప్రవాహం తగ్గుముఖం పడితే సందర్శకులను అనుమతి ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

జోరు వానలో పీవో పర్యటన

లక్ష్మీపురంలో వంతెనలు పూర్తి చేయాలని ఆదేశాలు

- చుట్టిగొంది వంతెనకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ హామీ



కర్లాపొదర్ గెడ్డపై నూతన వంతెన నిర్మించనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు, జూలై 25: మండల పరిధిలో గురువారం జోరు వానలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ పర్యటించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడం, రాకపోకలు స్తంభించిపోయిన విషయం పత్రికల్లో రావడంతో పీవో స్పందించి మండలంలో పర్యటించారు. తొలుత లక్ష్మీపురం పంచాయతీలో లక్ష్మీపురం, ముంతగుమ్మి, బిర్రుగూడ ప్రాంతాల్లో అసంపూర్తి పనులతో నిలిచిన వంతెనలను ఆయన పరిశీలించారు. పనులు మధ్యలో ఆగిపోవడానికి గల కారణాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు నాటికి వాటి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదే పంచాయతీ కర్లాపొదర్ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయను పరిశీలించారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో ఆ గెడ్డపై వంతెన నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. జీసీసీ డిపోల ద్వారా ఉచితంగా నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ పీవో దృష్టికి తీసుకువెళ్లగా..ఆయన సానుకూలంగా స్పందించారు. ఆగస్టు నెల సరకులు ముందుగానే పంపిణీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే గిరిజనులతో పీవో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారం అందిస్తామని, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో అత్యవసర సమయంలో బయటకు వచ్చే వారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వీలైనంత వరకు ఇళ్లను వదిలి ఎవరూ బయటకు రావద్దని సూచించారు. చుట్టిగొంది వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు ... మిగతా 8వ పేజీలో

బర్త్ సర్టిఫికెట్లకు వసూళ్లపై విచారణ

బాధితులు, వైద్యులు, ఉద్యోగుల నుంచి వివరాల సేకరణ

- రూ.500 తీసుకున్నట్టు అంగీకరించిన వైద్యులు
- విచారణకు హాజరుకాని వైద్యులకు షోకాజు నోటీసు, ఒక రోజు జీతం కోత
- డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కి నివేదిక
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవి



జూనియర్ అసిస్టెంట్‌ని విచారిస్తున్న డాక్టర్ నీలవేణి దేవి

చింతపల్లి, జూలై 25: స్థానిక ఏరియా ఆస్పత్రిలో జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు సూపరింటెండెంట్ నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నీలవేణిదేవి రెండో విడత విచారణ చేపట్టారు. కొంత కాలంగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని కొంతమంది బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈనెల 19వ తేదీన పాడేరు డీసీహెచ్ఎస్ కె. కృష్ణారావు విచారణ చేపట్టారు. ఈ విచారణకు స్థానిక సూపరింటెండెంట్ హాజరుకాలేదు. దీంతో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవిని విచారణ అధికారిగా నియమించారు. ఈమేరకు ఆమె గురువారం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, దిగువ స్థాయి ఉద్యోగులు, బాధితులను వేర్వేరుగా విచారించారు. ఈ విచారణలో కొంతమంది బాధితులు, ఉద్యోగులు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.500 జూనియర్ ... మిగతా 8వ పేజీలో

ఐఐటీ, ఎన్ఐటీల స్థాయికి ఏయూ

నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యం

- అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రణాళిక
- వర్సిటీని రాజకీయాలకు దూరంగా ఉంచడమే ప్రథమ కర్తవ్యం
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకును మెరుగుపరుచుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన
- పరిశోధనలను ప్రోత్సహిస్తాం
- ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు
- శతాబ్ది ఉత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహిస్తాం
- ప్రధానిని ఆహ్వానించే ఆలోచనలు ఉన్నాయి
- ఏయూను జాతీయ స్థాయిలో ముందువరుసలో నిలపడమే ధ్యేయం
- విద్యార్థులు ఏ సమస్యా ఉన్నా నా దృష్టికి తీసుకురావచ్చు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు



ప్రొఫెసర్ జి.శశిభూషణరావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

"ఐఐటీ, ఎన్ఐటీల స్థాయిలో ఏయూను తీర్చిదిద్దుతాం. నేషనల్ యూనివర్సిటీల మాదిరిగా ఏయూకు బ్రాండ్ క్రియేట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశా. ఐఐటీ, ఎన్ఐటీల్లో చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు చూడగానే ఇంటర్వ్యూ, టెస్ట్ లేకుండా ఉద్యోగాలు ఇస్తున్నారు. అదేస్థాయికి వర్సిటీని తీసుకువెళతాం' అని అంటున్నారు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు. ఇన్‌చార్జి వీసీగా కొద్దిరోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో యూనివర్సిటీలో నియామకాలు, కొత్త కోర్సుల ప్రారంభం, వందేళ్ల ఉత్సవాలు సహా అనేక అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఏయూ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళిక

యూనివర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాను. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతాను. ముఖ్యంగా రాజకీయాలకు వర్సిటీని దూరంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నా. పొలిటికల్ ఫ్రీ క్యాంపస్ చేయడమే నాముందున్న ప్రథమ కర్తవ్యం. అకడమిక్స్ క్వాలిటీని ఇంప్రూవ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాను. ఐఐటీ, ఎన్ఐటీ స్థాయికి వర్సిటీని తీసుకువెళతాను. గత కొన్నాళ్లుగా నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో వర్సిటీకి మెరుగైన ర్యాంకు రాలేదు. ఈ ర్యాంకు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశా. ప్రస్తుతం ఏయూకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు 76. రానున్న ఏడాదిలో 30 నుంచి 40 మధ్యలో తెచ్చుకోవడంపై దృష్టిసారించా. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను తెలియజేస్తుంది. 50 లోపు ర్యాంకు ఉంటే కేంద్ర సంస్థలు, ఇతర ఆర్గనైజేషన్ నుంచి సుమారు రూ.100 కోట్లు వరకు ప్రాజెక్టులు వచ్చేందుకు అవకాశం ఉంది. ఈ నిధులు వర్సిటీలో అభివృద్ధికి, పరిశోధనలు పెరగడానికి దోహదం చేస్తాయి.

పరిశోధనలు పెరగాలి..

యూనివర్సిటీలో పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రోత్సహిస్తాం. ఈ మేరకు వర్సిటీలోని ప్రిన్సిపాళ్లు, డీన్లకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం. ప్రిన్సిపాల్స్ కూడా తప్పనిసరిగా ఒక సబ్జెక్ట్ బోధించాలని ఆదేశాలు జారీచేశాం. టైమ్ టేబుల్, అకడమిక్ క్యాలెండర్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టంచేశాం. ముఖ్యంగా ప్రతి విభాగంలో పరిశోధన ప్రాజెక్టులు ప్రోగ్రెస్‌లో ఉండేలా చూడాలని ఆదేశించాం. కొన్నిచోట్ల పరిశోధనలు ఉన్నా..పబ్లికేషన్స్ ... మిగతా 7వ పేజీలో

డీసీసీబీ లాభం రూ.1.6 కోట్లు

మొత్తం వ్యాపారం రూ.2217.55 కోట్లు

- ప్రతి సొసైటీలో ఆధ్వరంలో పెట్రోల్ బంకు ఏర్పాటు
- జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ ఆమోదం

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,60,02,106 నికర లాభం సాధించినట్టు ప్రకటించింది. మొత్తం రూ.2,217.55 కోట్ల వ్యాపారం చేసింది. మొత్తం వ్యాపారంపై రూ.3.13 కోట్ల స్థూల లాభం ఆర్జించగా పన్నులు, ఖర్చులు తీసి వేస్తే నికరంగా రూ.1.6 కోట్లు లాభం వచ్చినట్టు ప్రకటించింది. గురువారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా జేసీ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో వ్యాపార లావాదేవీలు, ఆడిట్ రిపోర్టుపై చర్చించి ఆమోదించారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనకాపల్లి జిల్లాలో 74, విశాఖ జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 సొసైటీలు ఉన్నాయి. సొసైటీలు వ్యాపార విస్తరణలో భాగంగా ప్రతి మండలంలో పెట్రోల్‌బంకు ఏర్పాటుచేయాలని, ఎరువుల వ్యాపారం నిర్వహించాలని, అందుబాటులోకి వచ్చిన గోదాములను ఖాళీగా ఉంచకుండా వ్యాపార కార్యకలాపాలకు కేటాయించాలని సభ తీర్మానించింది. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్ మాట్లాడుతూ సొసైటీల పర్సన్ ఇన్‌చార్జిలు వ్యాపార విస్తరణ చేపట్టి లాభాలు ఆర్జించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. త్వరలో ప్రతి సొసైటీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. అవినీతికి చోటులేని పాలన అందించాలని ఆదేశించారు. మహజన సభలో బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ, అనకాపల్లి జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి, ఆడిట్ అధికారి డి.గోవిందరావు, సొసైటీల పర్సన్ ఇన్‌చార్జులుపాల్గొన్నారు.

క్రైం... crime news

రూ.34 వేల కలప స్వాధీనం

కొయ్యూరు, జూలై 25: అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధం చేసిన కలపను అటవీశాఖ సిబ్బంది గురువారం స్వాధీన పరచుకున్నారు. ఇందుకు సం బంధించి పెదవలస రేంజ్ అధికారి శివరంజని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకరపాడు బీట్ పరిధి ఆడా కులు, బాలారం సరిహద్దుల్లో కలప అక్రమ రవాణాకు సిద్ధం చేసినట్టుగా అందిన విశ్వసనీయ సమాచారంతో గురువారం ఉద యం అటవీ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 10 నల్లమద్ది దుంగలను స్వాధీన పరుచుకుని కాకరపాడు అటవీ డిపోకు తరలించారు. వీటి విలువ సుమారు రూ.34 వేలు ఉంటుందని శివరంజని తెలిపారు. ఈ దాడులలో ఎఫ్ఎస్‌వో నూకరాజు, ఎఫ్‌బీవో రమణ, భూషణం, నాగేశ్వరావు, గోపి పాల్గొన్నారు.

ట్రావెల్స్ డ్రైవర్‌పై కేసు నమోదు

కశింకోట, జూలై 25: విశాఖపట్నం శ్రీదేవి ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ వినోద్‌బాబు తెలిపారు. రాజమండ్రికి చెందిన నక్కా రాజశేఖర్ రిలయన్స్ మార్ట్‌కు స్టాక్ సరఫరా చేస్తుంటారు. అయితే రాజ మండ్రిలో ఉన్న రిలయన్స్ మార్ట్ నుంచి అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న జియో మార్టులకు సరకు సరఫరా చేసేందుకు వ్యాన్‌ను విశాఖపట్నం పంపిం చారు. మూడు రోజులు గడచినా ఈ సరకు విశాఖపట్నానికి డెలివరీ కాకపోవడంతో జీపీఎస్ ట్రాక్‌గా వాహనాన్ని తాళ్లపాలెంలో ఉన్నట్టు గుర్తించారన్నారు. దీంతో ట్రావెల్స్ యజమాని పుల్లారెడ్డి గారి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాళ్లపాలెం వద్ద నిలిపివేసి ఉన్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని, మద్యం సేవించి ఉన్న డ్రైవర్ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నా మని చెప్పారు. కాగా వ్యాన్‌లో రూ.5వేలు విలువ చేసే సరకు లేనట్టు గుర్తించా మన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

ఒరిగిన భారీ ట్రాలీ

- రెండు పెద్ద క్రేన్‌ల సాయంతో బయటకు తీసిన వైనం
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు


పక్కకు ఒరిగిపోయిన ట్రాలీ

ఎస్. రాయవరం, జూలై 25: నూతన భారీ వాహనాన్ని లోడ్ చేసుకొని అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న భా రీ ట్రాలీ లారీ గురువారం మండ లంలోని గోకులపాడు సమీపంలో కి వచ్చేసరికి రోడ్డు పక్కకు ఒరిగి పోయింది. అయితే ఈ లారీపై మరొక భారీ వాహనం ఉండడం తో అది ఎటూ కదలని పరిస్థితి నె లకొంది. దీంతో సమాచారం అం దుకున్న జాతీయ రహదారి సిబ్బంది ఈ వాహనాలను తీసేందుకు రెండు భా రీ క్రేన్‌లను రప్పించారు. ముందుగా ఉన్న నూతన వాహనాన్ని ట్రాలీ నుంచి దించిన తర్వాత ట్రాలీ లారీని బయటకు తీయించారు. తర్వాత ట్రాలీపై నూత న భారీ వాహనాన్ని ఎక్కించి పంపించారు. ఈ క్రమంలో సుమారు అర్ధగంట సేపు పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు.

రక్తహీనతతో గిరిజన మహిళ మృతి


సత్యవతి (ఫైల్)

గూడెంకొత్తవీధి, జూలై 25 : మండలంలోని గూడెం అద్దరవీధి గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళ రక్తహీనతతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గూడెం అద్దరవీధికి చెం దిన చెక్క సత్యవతి (35) కొంత కాలంగా రక్తహీన తతో బాధపడుతున్నది. బుధవారం ఆమెకు ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక పీహె చ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలికి 6 గ్రాముల హెచ్‌బీ ఉండడంతో శుక్రవారం శస్త్రచికిత్స చేస్తామని కేజీహెచ్ వైద్యు లు తెలిపారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం సా యంత్రం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

విధి నిర్వహణలో గుండె పోటుతో కండక్టర్ మృతి


పీవీఎస్ నారాయణ (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, జూలై 25 : అల్లూరి జిల్లా పాడేరు ప్రజా ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ (ఆర్టీసీ)లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ పీవీఎస్ నారాయణ గురువారం విధి నిర్వాహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన నారా యణ గత రెండేళ్ళుగా పాడేరు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం పాడేరు-అరకు ఉదయం 7.45 గంటల సర్వీస్‌లో విధులకు హాజరయ్యారు. బస్సు డుంబ్రిగుడ మండల కేంద్రం సమీపించే సరికి కండక్టర్ నారాయణకు గుండెలో నొప్పి రావ డంతో ఇబ్బందికి గురయ్యాడు. ఈ విషయాన్ని డ్రైవర్‌తో చెప్పడంతో డుంబ్రిగు డలో బస్సు నిలిపి కండక్టర్‌ను అక్కడ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం అరకు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అక్కడి వైద్యులు సూచించడంతో అక్కడ నుంచి కండక్టర్‌ను అదే బస్సులో అరకు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందుతూ కండక్టర్ నారాయణ తుది శ్వాసవిడిచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిపోమేనేజర్ వేదుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అరకు ఆస్పత్రికి చేరు కున్నారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యు లకు అప్పగించి పీటీడీ బస్సులో స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు. నారాయణకి డిపో అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

'పేట' పీహెచ్‌సీ స్థలం హద్దులపై వివాదం

పాయకరావుపేట, జూలై 25 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తమ స్థలం ఉందంటూ పక్క స్థల యజమాని సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేయ డంపై వివాదం తలెత్తింది. స్థానిక మెయిన్‌రోడ్డును ఆనుకుని వై. జంక్షన్ సమీపం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. ఈ సమయంలో పక్క స్థల యజమాని ఆసుపత్రిలో తన స్థలం ఉందంటూ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రహరీ గోడ నుంచి 15 అడుగుల లోపలకు హద్దు లు ఏర్పాటుచేసి తాడు కట్టారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి తహసీల్దారుకు ఫి ర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పక్క స్థల యజ మాని ఆసుపత్రి స్థలంలో తాడు ఏర్పాటుచేయడాన్ని గుర్తించి రెవెన్యూ అధికారుల ను నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీ నివాస్, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, వికాస తరంగిణి సభ్యు లు చిక్కాల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ప్రహరీ గో డ కట్టిన సమయంలో అడ్డుకోని స్థల యజమాని ఇపుడు ఆసుపత్రిలో తన స్థలం ఉందంటూ హద్దులు ఏర్పాటుచేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనివలన 200 గ జాల స్థలం ఆక్రమణ పాలవుతోందని ఆరోపించారు. ఇదిలా ఉంటే ఆసుపత్రి స్థల వివాదాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి స్థానిక నాయకులు తీ సుకెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు వెనక్కి తగ్గారు. ఈ సందర్భంగా తహసీ ల్దారు సూర్యనారాయణ మాట్లాడుతూ పీహెచ్‌సీ ప్రహరీ గోడ గతంలో ఉన్న చోటే కొత్తగా రక్షణ గోడ నిర్మాణం చేసుకోవచ్చని ఆదేశించామని తెలిపారు.

'అవినీతి అధికారుల నుంచి డీసీసీబీని కాపాడండి'

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన అవినీతి అధికారుల నుంచి జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకును కాపాడాలని డీసీసీబీ మాజీ డైరెక్టరు గనగళ్ల వివేక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2017లో డీసీసీబీలో దాట్ల వెంకట సుబ్రహ్మణ్య వర్మ దొడ్డిదారిన బ్యాంకు సీఈఓగా బాధ్యతలు చేపట్టారని ఆరోపించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్

కనీస వసతులు కరువు

- డంపింగ్ యార్డును తలపిస్తున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు


బురదనీరు దాటుకొని కాంప్లెక్స్‌కు వస్తున్న ప్రయాణికులు

చోడవరం, జూలై 25:

చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్వానంగా ఉంది. కాంప్లెక్స్‌లోకి అడుగుపెట్టాలంటే బురదనీరు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌లో బస్సు కోసం వేచి ఉన్నంత సేపు పరిసరాల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించి కూర్చోకతప్పని దుస్థితి ఉంది.


ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లోని వ్యర్థాలు

అటు అల్లూరి జిల్లా, ఇటు అనకాపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు చోడవరం ఆర్టీసీ కాంప్లె క్స్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు, పరిశుభ్రతను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక కాంప్లె క్స్ పరిసరాల్లో చెత్తాచెదారం పారబోయడంతో ఆవరణ అంతా డంపింగ్ యార్డును తలపిస్తుంది. కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న చెరువులో వ్యర్థాలు పారబోయడంతో పాటు ఒక్కోసారి చెరువులో చనిపోయిన చేపలు కుళ్లి పోయి దుర్వాసన రావడంతో కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ముక్కుమూసుకుని కూర్చోవలసిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ కాంప్లెక్స్ బోర్డుతో పాటు, సన్‌షేడ్ మూడు నెలల క్రితం కూలిపో యింది. అయితే ఇప్పటి వరకు మళ్లీ బోర్డు ఏర్పాటు చేయాలన్నా ఆలోచనే అధికారులకు రాలేదు. కాగా కాంప్లెక్స్ ఆవరణలోని సులాభ్ కాంప్లెక్స్ టాయిలెట్ల ట్యాంకుల పైకప్పు లేచిపోవడంతో ఆ దుర్గంధం పరి సరాలలో వ్యాపిస్తున్నది. దుకాణాల అద్దెల రూపంలో ఆర్టీసీకి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీస వసతులు, పరిశుభ్రతను పాటించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు

పాఠశాల విద్యలో సమస్యలను పరిష్కరించాలి

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబ్బాయి


డీఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

అనకాపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను పరి ష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో ఎంవీ లక్ష్మమ్మకు యూటీఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చిన్నబ్బాయి మాట్లా డుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యారం గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జీఓ నంబరు 117ను రద్దు చేసి.. జీవో నంబరు 55 ప్రకారం టీచర్ల నియామకాలు జరపాల న్నారు. ప్రీప్రైమరీతో పాటు ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించా లని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కోరారు. హైస్కూల్స్‌లో నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. మరో 20 కిపైగా ఇతరత్రా సమస్యలను పరి ష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జీఎస్ ప్రకాశ్, ఎంవీ అప్పారావు, శంకర్, రాజునాయుడు, దేముడునాయుడు, బాబూరావు, ఆశ, తేజేవర న్, శివయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి నీరు విడుదల

నీటి మట్టం 1,036 అడుగులకు చేరడంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు

- ఒక గేటు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీరు విడుదల


ఒక గేటు ఎత్తి 2173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

సీలేరు, జూలై 25: సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలా శయం నీటిని బుధవారం అర్ధరాత్రి జెన్‌కో అధికారులు విడుదల చేశారు. జలాశయంలోకి ఎనిమిది వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తున్నది. బుధవారం అర్ధరాత్రికి జలాశయంలో నీటి మట్టం 1036 అడుగులకు పెరగడంతో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆరో నంబర్ గేటు రెండు అడుగుల ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డొంకరాయి ఈఈ విజయ్‌కు మార్ మాట్లాడుతూ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,037 అడుగులు కాగా ఉన్నతాధికారుల నీటిని విడిచిపెట్టామన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 4వేలు నుంచి 4,500 క్యూసెక్కులు ఉందన్నారు. జలాశ యంలో 1035.50 అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం కొనసాగేటట్టు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే డొంకరాయి పవర్ కెనాల్‌కు 3 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

ఐఐటీ, ఎన్ఐటీల స్థాయికి ఏయూ

... 5వ పేజీ తరువాయి

లేవు. క్వాలిటీ జర్నల్స్‌లో పబ్లికేషన్స్ లేకపోవడం కూడా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ పడిపోవడానికి కారణం. రీసెర్చ్ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాల్సిందిగా సీనియర్ ప్రొఫెసర్లను, ఫ్యాకల్టీని ప్రోత్సహిస్తున్నాం. ఫం డింగ్ చేసే సంస్థలకు దరఖాస్తు చేయాలని సూచించాం. దీనివల్ల వర్సి టీకి ఆదాయం లభించడంతోపాటు పీహెచ్‌డీలు అందించేందుకు అవకా శం ఏర్పడుతుంది.

తొలిసారి పెర్ఫార్మెన్స్ అప్రైజల్ ఫామ్

అంతర్జాతీయంగా పేరుగాంచిన వర్సిటీల్లో పెర్ఫార్మెన్స్ అప్రైజల్ ఫా మ్‌తో ఫ్యాకల్టీ ప్రతిభ, పరిశోధనలు, ఇతర అంశాలను అసెస్ చేస్తుంటా రు. తొలిసారి ఈ విధానాన్ని వర్సిటీలో ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతు న్నాం. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పుడు వివిధ అంశాలతో కూడిన ఫామ్‌ను ఫ్యాకల్టీకి అందిస్తాం. ఇయర్ ఎండింగ్‌లో వాటిని తీసుకుం టాం. వీటిని చూడగానే సదరు ఫ్యాకల్టీకి సంబంధించిన పరిశోధన ప్రా జెక్టులు, ఇతర అంశాలపై అంచనాకు రావచ్చు. వీటిని హై లెవెల్‌లో ప రిశీలించే సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తున్నాం. దీనివల్ల బోధనతోపాటు పరిశో ధనలోనూ నాణ్యత పెరుగుతుంది. ఇది ఎడ్యుకేషన్‌లో క్వాలిటీని పెంచేం దుకు దోహదపడుతుంది. ఇందులో సదరు ఫ్యాకల్టీ నమోదుచేసే పరిశో ధనకు సంబంధించిన అంశాలను గూగుల్ స్కాలర్ సైటేషన్ ఇండెక్స్ ఐ10 ఇండెక్స్, హెచ్ ఇండెక్స్‌లో ఆటోమేటిక్‌గా తెలుసుకునే వెసులుబా టు ఉంది. రీసెర్చ్, పబ్లికేషన్స్, ఫ్యాకల్టీ, అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్, టీచింగ్‌పై ప్రధానంగా దృష్టిసారించి ముందుకువెళుతున్నాం.

ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు

ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త కోర్సులు ప్రారంభించబోతు న్నాం. 500 సీట్లతో బీఈడీ ప్రారంభిస్తాం. ఇంకా ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్, బీకాం కంప్యూటర్ సైన్స్, బీబీఏ, ఎమ్మెస్సీ జియో ఇన్ఫర్మే టిక్స్ కోర్సులు ప్రారంభిస్తున్నాం. రానున్న రోజుల్లో అవసరాలకు అనుగు ణంగా కోర్సులు ప్రారంభిస్తాం. వర్సిటీలో సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులకు స్పష్టమైన ఆదేశాలు జా రీచేశాం. వీసీలు వస్తుంటారు..వెళుతుంటారు. కానీ, వర్సిటీకి పేరుతెచ్చే విధానానికి మాత్రం అంతా బద్ధులై వ్యవహరించాలి. అప్పుడు వర్సిటీకి జాతీయస్థాయిలో పేరు వస్తుంది. విదేశీ విద్యార్థుల సంఖ్యను పెంచుకో వడంపై కూడా దృష్టిసారిస్తున్నాం.

వందేళ్ల వేడుకలు అదుర్స్ అనేలా నిర్వహణ

ఆంధ్ర యూనివర్సిటీ వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వందో వసంతంలోకి అడుగుపెడుతోంది. 2026 ఏప్రిల్ 26 నాటికి వందేళ్లు పూ ర్తి చేసుకుంటుంది. ఏడాదిపాటు వందేళ్ల వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం, ఏ యూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సహకారంతో అంగరంగ వైభవం గా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, కల్చరల్ ఈవెంట్స్ వంటివి నిర్వహిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీని ఆ హ్వానించే ప్రణాళికలు ఉన్నాయి.

వీసీకి, ప్రిన్సిపాల్‌కు మధ్య ఉన్న బంధమే..

మాజీ వీసీ ప్రసాదరెడ్డికి, నాకు ఉన్న బంధం...ఒక ప్రిన్సిపాల్‌కు, వీసీ మధ్య ఉన్న బంధమే. అంతకుమించి అనుబంధం ఏమీ లేదు. నేను రా జకీయాలకు దూరంగా ఉండే వ్యక్తిని. యూనివర్సిటీ పాలనలోకి రాజకీ యాలను రానివ్వను. నన్ను నమ్మి ప్రభుత్వం ఈ బాధ్యతలను అప్పగిం చింది. ఇందుకు గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ము ఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు. ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయడం, యూనివర్సిటీని జాతీయ స్థాయిలో ముందంజలో నిలపడమే నా లక్ష్యం. గత వీసీ హయాంలో నిధులు దు ర్వినియోగం, ఇతర అంశాలు నా దృష్టికి ఏమీ రాలేదు. కొన్నిచోట్ల అవక తవకలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలి స్తాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకువెళతాం. విచారణ కు ఆదేశిస్తే ఆ మేరకు వర్సిటీ నుంచి అవసరమైన సమాచారాన్ని అంది స్తాం. వీసీ పేషీతోపాటు కొన్ని సెక్షన్లలో పనిచేసే సిబ్బందిని మార్చాం. మిగిలిన వారిని కూడా మారుస్తాం. డీన్లు, ప్రిన్సిపాల్స్‌ను మార్చబోతు న్నాం.

యూజీసీ నిబంధనలు మేరకే నియామకాలు

గౌరవ ప్రొఫెసర్లకు వేతనాలు చెల్లించరు. వారు కొన్ని డిపార్టుమెంట్స్ లో మాత్రమే ఉన్నారు. యూనివర్సిటీ నుంచి రూపాయి కూడా చెల్లించే పరిస్థితి లేదు. యూజీసీ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసెస్, అ డ్జెంక్ట్ ప్రొఫెసర్లు వర్సిటీలోని మొత్తం ప్రొఫెసర్లలో పది శాతం మంది ఉండాలి. ఈ మేరకు యూజీసీ నిబంధనలు ఉన్నాయి. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ అంతా పరిశ్రమల నుంచి వచ్చిన వాళ్లే ఉండాలి. ఈ రెండు కేట గిరీలకు చెందిన వారికి రూ.80 వేలు మాత్రమే చెల్లిస్తాం. ఈ మేరకు యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. ఎన్ఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వీటికి సంబంధించి కొన్ని పాయింట్లు కూడా పెట్టింది. కాబట్టి, వారిని తప్పనిస రిగా నియమించుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అనేక వి భాగాల్లో ప్రొఫెసర్ల కొరత ఉంది. దాంతో బోధనపై ప్రభావం పడకుండా గౌరవ ప్రొఫెసర్‌లతోపాటు గెస్ట్ ఫ్యాకల్టీ సహాయంతో విభాగాలను నిర్వ హిస్తున్నాం. కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీని గతంలో తొలగించారు. వారిపై నిర్ణయం తీసుకుంటాం. అవసరమున్న విభాగాల్లో ఈ ఏడాదే తీసుకుం టాం. వచ్చే ఏడాది కొన్ని కోర్సులు ప్రారంభిస్తే...మిగిలిన వారిని తీసు కుంటాం. గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకున్నప్పుడు కమిటీ వేసి..పారదర్శకంగా వ్యవహరిస్తాం. ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన వారిపై ప్రస్తుతానికి ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేను. వారికి ప్రభుత్వమే జీతాలు చెల్లి స్తోంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం. ప్రభుత్వ ఆదేశాల కు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. ఎయిడెడ్ ఫ్యాకల్టీలో కొందరికి హెచ్‌వోడీలుగా, డీన్లుగా అవకాశాలు ఇచ్చారు. అటువంటి వారిని తొల గించాం.

విద్యార్థుల ఇబ్బందులపై..

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురా వచ్చు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. హాస్టళ్లలో మెనూ అమలు చేస్తున్నారా?, లేదా..? అన్న దానిపై విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చు. క్వాలిటీ ఎలా ఉంటుందో పరిశీలించేందుకు రెండుసార్లు భో జనం చేశాను.

మూడు వేల ఎకో ఫ్రెండ్లీ మొక్కలు నాటే కార్యక్రమం

విద్యార్థులు వర్సిటీలో క్రమశిక్షణతో మెలిగేలా చర్యలు తీసుకుంటు న్నాం. గంజాయి, మత్తుమందులకు దూరంగా ఉండేలా చర్యలు తీసు కుంటున్నాం.

వర్సిటీలో 3000 ఎకో ఫ్రెండ్లీ మొక్కలను నాటబోతున్నాం. క్యాంపస్ మొత్తం గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం పోర్టు కొన్ని మొక్కలను అందించింది. మేము కొన్ని కొనుగోలు చేశాం. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్, అటవీ శాఖ అధికారులు అను మతి, సహకారంతో క్యాంపస్‌లో నాటబోతున్నాం.


గెడ్డలో నిల్చొని నిరసన తెలుపుతున్న బొర్ర చింత గిరిజనులు

బొర్ర చింత గిరిజనుల నిరసన

- రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్

దేవరాపల్లి, జూలై 25: మండలంలోని వాలాబు శివారు బొర్ర చింత గ్రామ గిరిజనులు గురువారం గెడ్డలో నిల్చొని నిరసన తెలిపారు. రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, మత్సరాజు, రాములు, పైడి తల్లి, దేవరాజు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నక్కపల్లి, జూలై 25: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవ త్సరానికి సంబంధించి, సింగిల్ మేజర్ బోటనీ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అతి థి అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివ య్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ బోటనీలో 55 శాతం మార్కు లు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎన్ఈటీ, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రా ధాన్యత వుంటుందని, ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పదేళ్ల తర్వాత ఎలమంచిలికి ఎక్స్‌ప్రెస్ బస్సులు

- కూటమి నేతల సంబరాలు


చంద్రబాబు, పవన్ కల్యాణ్, విజయకుమార్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

ఎలమంచిలి, జూలై 25: ఎట్టకేలకు ఎలమంచిలి బస్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు లు పునరుద్ధరించడంతో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఉ దయం 9 గంటల సమయంలో కాకినాడ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎలమంచిలి బస్టాండ్‌లోకి రావడంతో కూటమి నేతలు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బస్సు డ్రైవర్, కండక్టర్లకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జనసేన పార్టీ ప ట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను మాట్లాడుతూ ఎలమంచిలి పట్టణంలోని బస్టాండ్‌కు పదేళ్ల తర్వాత ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ ప్రత్యేక దృష్టి సారించడంతో ఎక్స్‌ప్రెస్ బస్సుల పునరుద్ధరణ జరిగిందన్నారు. టీడీపీ పట్టణ అధ్య క్షుడు గొర్లె నానాజీ, జనసేన జిల్లా కార్యదర్శి కొఠారు నరేష్ మాట్లాడుతూ ప్రజల స మస్యను గుర్తించి ఎక్స్‌ప్రెస్ బస్సులు పునరుద్ధరించడంలో ఎమ్మెల్యే చూపిన చొర వను ప్రజలు మరచిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, లంక రాజు, పల్లా సత్యనారాయణ, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీ ను, చిట్టిబాబు, కరణం రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- డీఈవో వెంకటలక్ష్మమ్మ

లంకెలపాలెం, జూలై 25: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ పిలుపునిచ్చారు. శిక్షా సప్తహ క్రీడా వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజూ పెదముషిడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ తమ ప్రతిభను చూపించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మురళీపట్నాయక్, సర్వశిక్ష అభియాన్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది త దితరులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

తుమ్మపాల, జూలై 25 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే ప రిష్కరించాలని పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. భాస్కర్ డిమాండ్ చేశారు. గురు వారం విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేప ట్టారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ కాలేజి హాస్టల్‌కు కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 3,480 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేయాలన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రమేశ్

అనకాపల్లి టౌన్, జూలై 25: పాన్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా జిల్లా న్యాయ మూర్తి ఎన్. శ్రీవిద్య ఆదేశాల మేరకు అనకాపల్లి 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రమేశ్ గురువారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవ సరమైన నిందితులకు ఉచిత న్యాయ సహాయ అవకాశం కల్పిస్తామని, దీనిని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గణే ష్‌రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, రోజా, తులసీ, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి స త్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన

» ఆర్జేడీ విజయభాస్కర్



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడి విజయభాస్కర్

హుకుంపేట జూలై 25 : విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన అందించాలని ఆర్జేడీ విజయ భాస్కర్ స్పష్టంచేశారు. ఆయన గురువారం హుకుంపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రికార్డుల ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. ఈ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత శాతం ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ ఉంటున్న విద్యార్థులకు భోజన, సదుపాయాల విషయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు విధిగా ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. అదనపు భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఆర్జేడీ వెంట డీఈవో బ్రహ్మాజీ, ప్రిన్సిపాల్ ఎన్.జయప్రద ఉన్నారు.

పాడేరు రూరల్ : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల్లో గురువారం నిర్వహించిన టీచ్ టు టూల్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన విశాఖ జోన్-1 ప్రాంతీయ సంచాలకులు విజయ భాస్కర్ మాట్లాడుతూ..ఉపాధ్యాయుడు సానుకూల ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

పెదబయలులులో పీవో అభిషేక్ పర్యటన



బాధితులకు నిత్యావసర సరుకులను అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పెదబయలు, జూలై 25 : మండలంలోని కిముడుపల్లి పంచాయతి కిముడుపల్లిని గురువారం ఐటీడీఏ పీవో పర్యటించారు. భారీ వర్షాలకు పాక్షికంగా ఇళ్లు పోయిన కె.సుమిత్రమ్మ, ఎస్.లింగమ్మకు వంట సరుకులు అందజేశారు. వీరికి పరిహారం అందించాలని, తాత్కాలికంగా షెల్టర్ ఏర్పాటు చేయమని అధికారులను ఆదేశించారు. అలాగే జీసీసీ డీఆర్ డిపోను తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన భవనం నుంచి డిపోను వేరే చోటుకు మార్చాలని ఆదేశించారు. కిముడుపల్లి, లక్ష్మీపేట రహదారిలో, చీడిపుట్టు, కోడపల్లి పంచాయతీ పరధానిపుట్టు సమీపంలో గల కాజ్‌వే బ్రిడ్జిపై వచ్చిన వరద నీటిని పరిశీలించారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించమని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో విగ్గిన్సి అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల గైర్హాజరుపై టీడీపీ నేతల ఫిర్యాదు



విచారణ అధికారి నీలవేణికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

చింతపల్లి, జూలై 25 : స్థానిక ఏరియా ఆస్పత్రిలో కొంత మంది వైద్యులు తరచూ విధులకు ఎగనామం పెడుతున్నారని విచారణ అధికారి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. బుధవారం 'వైద్య సేవలు అస్తవ్యస్తం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వైద్యులు విధులకు గైర్హాజరు కావడంపై రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, పలువురు కూటమి నాయకులు గురువారం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వైద్యులు విధులకు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకొని వెళతామని, పాడేరులో పని చేస్తున్న ముగ్గురు వైద్యులను చింతపల్లికి పంపించకపోతే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోకూటమి నాయకులు కేశవరావు, పండు, బౌడు కుశలవుడు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు 41 ఎకరాల్లో పంట నష్టం



పంట నష్ట అంచనా వేస్తున్న అధికారులు

డుంబ్రిగుడ, జూలై 25 : భారీ వర్షాన నేపథ్యంలో మండలంలో వాటిల్లిన పంట నష్టాలను జిల్లా వ్యవసాయ, ఉద్యాన వనశాఖ అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్ కలిసి గురువారం పర్యటించారు. తూటంగి, లైగండ, అరమ పంచాయతీల్లో సందర్శించి వరి, మొక్కజొన్న, వేరుసెనగ, అల్లం, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 41 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిలినట్టు ఇప్పటి వరకూ గుర్తించామని తెలిపారు. అయితే వర్షాలు తగ్గుముఖం పడితేనే పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయగలమని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పడిన తర్వాతే వరినాట్లు వేసుకోవాలని గిరిజన రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులు నీలవేణి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి : డీ-అడిక్షన్ సిబ్బంది

పాడేరు రూరల్, జూలై 25 : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జీజీహెచ్ ఆస్పత్రి మత్తు వియోచన కేంద్రం(డీ-అడిక్షన్)లో పనిచేస్తున్న ఉద్యోగులకు బకాయి పడ్డ 13 నెలల జీతాలు చెల్లించాలని వైద్యుడు, సిబ్బంది కోరుతున్నారు. మత్తు వియోచన కేంద్రంలో పనిచేస్తున్న వైద్యుడితో పాటు 8 మంది కౌన్సెలర్లకు 13 నెలలుగా జీతాలు అందకపోవడంతో సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసిన ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి తక్షణమే బకాయి పడ్డ 13 నెలల జీతాలు అందించాలని వారు కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

» ఆగస్టు 10 వరకు స్పెషల్ డ్రైవ్
» అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం



పాడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వరద, ముంపు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌లు, ఐసీడీఎస్ అధికారులతో గురువారం చింతూరు నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. తాజా ప్రతికూల వాతావరణం నేపథ్యంలో కీటక జనిత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి నుంచి ఆగస్టు పదో తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రెవెన్యూ, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే విధిగా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, నీటి కుంటల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలన్నారు. డ్రైనేజీల్లోని పూడికతీత పనులు చేపట్టాలని, గ్రామాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలన్నారు. అలాగే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి ముందు, తర్వాత గ్రామం ఎలా ఉందనేది విధిగా డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. పారిశుధ్య పనులతో గ్రామాల్లో సమూల మార్పులు రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి సమాచారం అందించాలని, దోమల మందు పిచికారీ పక్కాగా జరగాలన్నారు. మందు పిచికారీ పనుల్లో వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది భాగస్వామ్యం కావాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రత్యేక పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి తులసి, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, జిల్లాలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెనలు పునరుద్ధరణ



పెదమాకవరం- నల్లగొండల మధ్య పునరుద్ధరించిన తాత్కాలిక వంతెన

కొయ్యూరు, జూలై 25 : భారీ వర్షాలకు కొండవాగు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయిన రామరాజుపాలెం, పి.మాకవరం- నడింపాలెం మధ్య తాత్కాలిక వంతెనలను జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టరు మరమ్మతులు చేసి పునరిద్ధరించారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఈ రెండు చోట్ల భారీ వంతెనలను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఉన్న బ్రిటీష కాలంలో నిర్మించి శిథిలావస్థకు చేరిన వంతెనలు తొలగించారు. ఈ క్రమంలో రాకపోకలకు ఇబ్బంది ఉండకూడదని ఈ వాగులపై సిమెంట్ తూరలతో తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేశారు. అయితే గత వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ తాత్కాలిక వంతెనలు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో కృష్ణాదేవిపేట నుంచి శరభన్నపాలెం, అటుగా చింతపల్లికి రాకపోకలు నిలిచాయి. గురువారం ఈ రెండు తాత్కాలిక వంతెనలకు మరమ్మతు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు.దీంతో నాలుగు పంచాయతీలకు చెందిన సుమారు 30 గ్రామాలకు రవాణా కష్టాలు తొలగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలి

జీఎస్‌యూ, ఏబీవీపీ వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

పాడేరు రూరల్, జూలై 25 : ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉన్న పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యూ), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గురువారం జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బుడిదే మాధవరావు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకు గత ఏప్రిల్‌లో అధికారులు కళాశాల తరగతి గదులను స్వాధీనం చేసుకున్నారన్నారు. కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు 950 మంది ఉన్నారన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో గత నెల జూన్ నుంచి ప్రారంభమైనప్పటి నుంచి ఆన్‌లైన్ ద్వారా తరగతులు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 29 నుంచి రెండో సెమిష్టర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఆ భవనాలను తిరిగి కళాశాలకు అప్పగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ, ఏబీవీపీ నాయకులు ఆనంద్, జయకుమార్, మోహన్, చిన్నబాయి, నరేంద్ర, శ్రీను, సంజయ్ పాల్గొన్నారు.

తగ్గని ముసురు!

... 5వ పేజీ తరువాయి

పదుల సంఖ్యలో గ్రామాలు ముంపునకు గురికావడంతో అధికారులు అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అలాగే అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు, అప్రమత్తం కావడంతో ప్రాణ నష్టాలు సంభవించలేదు.

జిల్లాలోని వరద ప్రభావం అధికంగా ఉన్న చింతూరు రెవెన్యూ డివిజన్‌లోనే కలెక్టర్ దినేశ్‌కుమార్ గత వారం రోజులుగా పర్యటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది చేపడుతున్న వరద సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీస్తున్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి చింతూరు, కూనవరం, వీఆర్.పురం, ఏటపాక మండలాల్లో చేపడుతున్న వరద సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు.

భారీ వర్షాలతో కల్వర్టులకు గండి



కోతకు గురై గండిపడిన రాసవీధి కల్వరు

జి.మాడుగుల, జూలై 25 : మండలంలోని ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు కల్వర్టులకు గండి పడింది. దీంతో రవాణాకు అంతరాయంఏర్పడుతోంది. జి.మాడుగుల నుంచి మద్దిగరువు వెళ్లే దారిలో బొయితిలి పంచాయతీ రాసవీధి సమీపంలో తాత్కాలిక కల్వర్టుకు గండి పడి సగానికి పైగా కొట్టుకుపోయింది. దీంతో బొయితిలి, కిల్లం కోట పంచాయతీల పరిధిలోని గ్రామాలు, ఒడిశాలోని పలు గ్రామాలకు చెందిన వాహన దారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కిల్లంకోట రహదారి పనులు, కోడిమామిడి వంతెన పనులకు ఈ రహదారిలో రాస వీధి సమీపంలో తాత్కాలికంగా పైపులతో కల్వర్టు నిర్మించారు. ఇప్పుడు ఈ కల్వర్టు కొట్టుకుపోవడంతో ప్రస్తుతం రావాణాకు అవకాశం లేకుండా పోయింది.

అలాగే కుంబిడిసింగి పంచాయతీ అండంగిసింగి వంతెన సైతం కోతకు గురైంది. దీంతో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే కల్వర్టులకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థులకు పాఠాలు బోధించిన పీవో



నోటు పుస్తకాలు పరిశీలిస్తున్న పీవో అభిషేక్

ముంచంగిపుట్టు, జూలై 25 : మండల పర్యటనకు గురువారం వచ్చిన పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కొంత సమయం ఉపాధ్యాయుడుగా మారారు. లబ్బూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. పలు ప్రశ్నలను వేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. మెనూ పక్కాగా అమలు చేయాలని వసతిగృహ నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నారులకు పోషకాహారాలను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు.

27న ఆర్‌ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

చింతపల్లి, జూలై 25 : స్థానిక ఆర్‌ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 27న ధ్రువపత్రాలు పరిశీలన నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.రాజారావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండో విడత ప్రవేశాలకు ఇప్పటికే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల విద్యార్హత, కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి అర్హులుగా గుర్తించాల్సి వుందన్నారు. ఈమేరకు ఉదయం పది గంటలకు విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9866108607 నంబరుకి కాల్ చేయాలన్నారు.

కొత్తపల్లి జలపాతం పరవళ్లు



జాలు వారుతున్న కొత్తపల్లి జలపాతం

కొత్తపల్లి జలపాతం వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. వర్షాలకు జలపాతంలో నీరు అధికంగా చేరడంతో కళకళలాడుతోంది. ఎగువ నుంచి నీరు జాలు వారుతున్న దృశ్యం కనువిందు చేస్తోంది. -జి.మాడుగుల

నష్టం అపారం

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో పాటు నీరు నిల్వ లేకుండా పల్లపు ప్రాంతానికి వెళ్లిపోవడంతో పంటల నష్టం తగ్గడానికి ప్రధాన కారణమని వ్యవసాయాధికారులు అంటున్నారు. అలాగే పంటల ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పర్యటించి పంటలకు నష్టం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. దీంతో వరి పంట పొలాల్లో నిలిచిన నీళ్లను బయటకు పంపడం, అధిక వర్షాల నుంచి పంటలను రక్షించుకోవడం వంటివి రైతులు చేపట్టారు. వర్షాలు పూర్తిగా తగ్గితేగాని జరిగిన మొత్తం నష్టంపై ఒక స్పష్టత రాదని అధికారులు అంటున్నారు.

ఉధృతంగా ప్రవహించిన గెడ్డలు

జిల్లాలో వరదల ప్రభావంతో పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గెడ్డలు ఎన్నడు లేని విధంగా పొంగి ప్రవహించాయి. ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో అవతల ఉన్న గిరిజనులు వారం రోజులు ఊళ్లకే పరిమితమయ్యారు. వర్షానికి కొన్ని ప్రాంతాల్లో వరి పంట కొట్టుకుపోగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇసుక మేటలు వేశాయి. అలాగే చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో అధికంగా గ్రామాలు ముంపునకు గురి కావడంతో ప్రజలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో కుటుంబాలతో తలదాచుకుంటున్నారు. అలాగే వరద బాధితులకు అధికారులు నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందిస్తున్నారు. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారులు వర్షాలు ఎప్పుడు పూర్తిగా తగ్గుముఖం పడతాయేనని ఎదురు చూస్తున్నారు. అలాగే ప్రభుత్వం సైతం వరద బాధితులకు సహాయక, పునరావాస చర్యలను ముందస్తుగానే చేపట్టింది. దీంతో నష్టం చాలా వరకు తగ్గిందని అధికారులు అంటున్నారు. జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ గత వారం రోజులుగా చింతూరులోని మకాం వేసి నిత్యం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. వరద బాధితులకు సహాయక, పునరావాస సేవలు పక్కాగా అందేలా కృషి చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జిల్లా యంత్రాంగంచింతూరు రెవెన్యూడివిజన్‌లోనే సేవలుఅందిస్తున్నారు.

బర్త్ సర్టిఫికెట్లకు వసూళ్లపై విచారణ

... 5వ పేజీ తరువాయి

అసిస్టెంట్, ఇద్దరు ఆరోగ్యశ్రీ డీఈవోల ద్వారా సూపరింటెండెంట్ తీసుకుంటున్నారని వివరించారు. అలాగే కొంతమంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు చెల్లించేందుకు రూ.వెయ్యి నగదు తీసుకున్నారని ఫిర్యాదు చేశారు. కాగా జనన ధ్రువీకరణ పత్రం జారీలో 21రోజులు దాటితే నోటరీ జతపర్చాల్సి వున్నదని, కొంతమంది గిరిజనులు నోటరీ కోసం రూ.500 నుంచి 800 న్యాయవాదులకు చెల్లిస్తున్నారని, దీంతో తామే నోటరీ చేయించేందుకు రూ.500 తీసుకుంటున్నామని, ఈ నగదును నోటరీ చేయించేందుకు మాత్రమే వినియోగిస్తున్నామని విచారణ అధికారికి తెలిపారు. ఈ సందర్భంగా విచారణ అధికారి మాట్లాడుతూ ఆస్పత్రిలో శిశువు జన్మించిన మరుసటి రోజే తల్లికి జనన ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం కోసం ఒక్క పైసా వసూలు చేయరాదన్నారు. ఆలస్యంగా జనన ధ్రువీకరణ పత్రం కోసం ఎవరైన వస్తే వారే నోటరీ చేయించుకొని రావాలని చెప్పాలన్నారు. ఈ విచారణ నివేదిక విశాఖపట్నం డీసీహెచ్ఎస్, విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులకు అందజేస్తామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారని విచారణ అధికారి నీలవేణి తెలిపారు.

హాజరు కాని వైద్యులకు షోకాజు నోటీసు, వేతనం కోత

విచారణకు హాజరుకాని వైద్యులకు షోకాజు నోటీసు, ఒక రోజు వేతనం కోత విధించాలని సూపరింటెండెంట్‌ని విచారణ అధికారి డాక్టర్ నీలవేణి దేవి ఆదేశించారు. వైద్యులందరూ విచారణకు హాజరుకావాలని ఐదు రోజుల ముందు సమాచారం ఇచ్చినా కొంత మంది వైద్యులు గైర్హాజరయ్యారన్నారు. గురువారం విధులకు హాజరుకాని వైద్యులందరికి షోకాజు నోటీసుతో పాటు ఒకరోజు వేతనం నిలిపివేయాలన్నారు. ఈ విచారణలో నర్సీపట్నంఏరియా ఆస్పత్రి ఏవో పి.శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.అప్పారావుపాల్గొన్నారు.

జోరు వానలో పీవో పర్యటన

... 5వ పేజీ తరువాయి

చేస్తామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న వంతెనలను పూర్తి చేసేందుకు చేపడతామన్నారు. అనంతరం లబ్బూరు, ముంచంగిపుట్టుల్లో పర్యటించారు. పీవో వెంట ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ రఫీ జాన్, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ జబ్బర్, పంచాయతీరాజ్ ఏఈ మురళి, పీఐయూ ఏఈ వినిల్, డిప్యూటీ తహసీల్దార్ అప్పల స్వామి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు

... 5వ పేజీ తరువాయి

ఏర్పడుతున్నదని విద్యుత్ సిబ్బంది తెలిపారు. ఎక్కడికక్కడ లైన్లలో లోపాలను సరిచేసుకుంటూ వస్తున్నా తిరిగి ఈదురుగాలులు వీస్తుండడంతో అదే సమస్య పునరావృతం అవుతున్నదని విద్యుత్ సిబ్బంది వాపోతున్నారు. అరకులోయలో ముసురు వాతావరణం కొనసాగుతునే ఉంది. గత నాలుగు రోజులుగా ఇదే వాతావరణం ఉంటుండడంతో పాఠశాలలకు సెలవులు కొనసాగుతున్నాయి.

☛ సంక్షిప్తంగా..

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

డుంబ్రిగుడ, జూలై 25 : మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఈదురు గాలులతో విద్యుత్ స్తంభం గురువారం మధ్యాహ్నం నేలకొరిగింది. పశువుల పాకలో స్తంభం నేలకొరిగింది. చుట్టూ పక్కల ఇళ్లల్లోని గిరిజనులు వ్యవసాయ పనులకు వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్తు స్తంభంతో పాటు చింతచెట్టు నేలకొరిగింది. దీంతో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

కూలిన భారీ వృక్షం



విద్యుత్ తీగలపై పడిన చెట్టు

సీలేరు, జూలై 25 : జీకే వీధి మండలం సీలేరులో వర్షాలకు భారీ వృక్షం కూలి విద్యుత్ తీగలపై పడింది. స్థానిక జెన్‌కో కాలనీలోని 3వ క్రాస్‌రోడ్డులో గురువారం మధ్యాహ్నం భారీ శబ్దంతో కూలింది. ఆ సమయంలో వర్షం పడుతుండడంతో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే జెన్‌కో సిబ్బంది చేరుకొని మూడు గంటల పాటు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గిరి గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బూసిపుట్టులో విద్యుత్ వెలుగులు

ముంచంగిపుట్టు, జూలై 25 : మండలంలో గల మారుమూల బూసిపుట్టు పంచాయతీలో పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 'అంధకారంలో మారుమూల గిరి గ్రామాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బూసిపుట్టు గ్రామానికి సందర్శించి పలు చోట్ల తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లను సరిచేశారు. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ వెలుగులు వచ్చాయి. అలాగే బూసిపుట్టులో త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు వినతిపత్రం అందించారు.

మహిళాభ్యుదయ బడ్జెట్

పాడేరు రూరల్, జూలై 25 : రాష్ట్ర మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి 2024 కేంద్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించడం హర్షణీయమని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ మహిళా అభ్యున్నతికి దోహదపడేలా ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మఠం శాంతకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరావు, కోశాధికారి కొర్రా ఆనంద్, మహిళా మోర్చా నేతలు శ్రీలక్ష్మి, కళావతి, సౌజన్య బీజేవైఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధాన్ని యువత మరువరాదు

కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ఉమామహేశ్వరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

పాడేరు రూరల్, జూలై 25 : చారిత్రిక కార్గిల్ యుద్ధాన్ని యువత మరువరాదని కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురసా ఉమామహేశ్వరరావు అన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ పిలుపు మేరకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం సాయంత్రం కార్గిల్ విజయ్ దివాస్ పేరిట 65 మీటర్ల జాతీయ జెండా, కాగడాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన అమర జవాన్‌లకు అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, పార్టీ నాయకులు గెమ్మెలి కొండబాబు, పాంగి మత్స్యకొండబాబు, మఠం శాంతకుమారి, సల్లా రామకృష్ణ, కె.రాఘవేంద్రరావు, ఎస్.వేమనబాబు, ఎన్.శివ, పి.భానుప్రసాద్, వెంకటరమణ, అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి : సీపీఎం

జి.మాడుగుల, జూలై 25 : భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స కోరారు. మండలంలోని గెమ్మెలి పంచాయతీ మద్దులబంధ గ్రామ పంట పొలాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తుపాన్ బాధితులకు ఆదుకోవాలని శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సీపీఎం బృందం కోరాతామని చెప్పారు. ఆయన వెంట మండల కార్యదర్శి సాగిన ధర్మనడాల్, నాయకులు చిన్నారావు, వరహాలబాబు, వీరన్నపడాల్ పాల్గొన్నారు.

27 మందికి ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు

ముంచంగిపుట్టు, జూలై 25 : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ప్రతీ గురువారం గర్భిణులకు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయనున్నామని సీహెచ్‌సీ వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. గురువారం సీహెచ్‌సీలో 27 మంది గర్భిణులకు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలతో పాటు పలు రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. వారికి అవసరమైన మందులను అందించారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ కాశీవిశ్వనాథం, డాక్టర్ వేబిన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.